వాయిస్ టుడే

హైదరాబాద్
శుక్రవారం, 29 మార్చి, 2024



## చోరీ కేసులను ఛేదించిన తూప్రాన్ పోలీసులు అభినందించిన జిల్లా ఎస్పీ బాలస్వామి

మెదక్ తూప్రాన్ వాయిస్ టుడే ప్రతినిధి :- మెదక్ జిల్లా తూప్రాన్ బస్సు స్టాండ్ లో గత నెల ఫిబ్రవరి 27నాడు బస్సు ఎక్కుతున్న మహిళ నుండి 12,1/2తులాల బంగారు ఆభరణాలు చోరీ కి గురయ్యాయి. తూప్రాన్ పోలీసులు ఇట్టి కేసును అతి చాకచక్యంగా ఛేదించి అంతరాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నారు. తూప్రాన్ డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ బాలస్వామి నిందితుల వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర కు చెందిన 5గురు పాత నేరస్థులు మహిళలు బస్టాండ్ లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నిందితుల నుండి బంగారు ఆభరణాలు రికవరీ తో పాటు వాళ్లు వాడుతున్న కారు ,5సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ బాల స్వామి,తూప్రాన్ డిఎస్పీ వెంకట్ రెడ్డి తెలిపారు. అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు రిమాండ్ కు పంపినట్లు మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. ఈ చోరీ కేసును చేదించిన డి.ఎస్.పి వెంకట్ రెడ్డి, సిఐ కృష్ణ, ఎస్సై శివానందం,తో పాటు ఐడి పార్టీ కానిస్టేబుల్ గోవర్ధన్, నాగేంద్రబాబు, వెంకట్, సురేష్,రాజు, కృష్ణలను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలోఏ ఎస్సై లక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసిన వాకిటి శ్రీహరి

మక్తల్ మార్చ్ 28 వాయిస్ టుడే ప్రతినిధి: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోలింగ్ లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతోపాటు నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి , జడ్పీ చైర్ పర్సన్ వనజా ఆంజనేయులు గౌడ్ తదితరులు ఓటేశారు. కసిరెడ్డి నారాయణ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో...తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయగా.. తిరిగి ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ ఎస్ నుంచి నవీన్ కుమార్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో ఉండగా...1439 మంది ఓటర్లు ఉండగా ... 1437 మంది ఓటేశారు. మే 2వ తేదీన ఫలితం తేలనుంది.



## మెదక్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షునిగా సుభాష్ చంద్ర గౌడ్, ఉపాధ్యక్షులుగా ఆకుల శ్రీనివాస్**

**గ్రంధాలయ కార్యదర్శిగా అశ్విన్ కుమార్.**

మెదక్ మార్చ్ 28 వాయిస్ టుడే ప్రతినిధి :- మెదక్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నాడు జరిగాయి ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలింగ్ జరిగాయి 85 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు సాయంత్రం నాలుగు గంటలకు ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రభాకర్, సాయికుమార్, లక్ష్మణ్ గౌడ్, మంజుల ప్రకటించారు. కే సుభాష్ చంద్ర గౌడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఆకుల శ్రీనివాస్, జె శ్రీపతిరావు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా , ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పరశురాములు గౌడ్ , గ్రంధాలయ కార్యదర్శిగా బోంతుల అశ్విన్ కుమార్, చిరంజీవి, రమేష్ నాయక్, శారద, బేగ్ లను ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు సంయుక్త కార్యదర్శిగా దొమ్మాట దుర్గారెడ్డి, క్రీడలు సాంస్కృత కార్యదర్శిగా కావేటి మధు కిరణ్ , ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులను పోచయ్య, జనార్దన్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రామారావు, పాండు, సీనియర్ న్యాయవాదులు అభినందించారు. అనంతరం సీనియర్ న్యాయవాదులు పోచయ్యను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. అనంత అనంతరం సీనియర్ న్యాయవాది పోచయ్య మాట్లాడుతూ న్యాయవాదులంతా కలిసిమెలిసి ఉండి , మన హక్కులను సాధించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి స్థానిక తాజా మాజీ బుడ్డస్వర్ణలత-భాగ్యరాజ్ అండ దండలు

### దశదినకర్మకు 50 కేజీల బియ్యం, ఆర్థిక సహాయం అందచేసిన స్వర్ణలతభాగ్యరాజు దంపతులు



మెదక్ చేగుంట వాయిస్ టుడే ప్రతినిధి :- మెదక్ జిల్లా చేగుంట మండలం చందాయిపేట గ్రామంలో గ్రామస్తుడు మరణించిన విషయం తెలుసుకొని స్థానిక సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ కుటుంబాన్ని పరామర్శించి తనకు తోచిన సహాయంగా ఇటీవల మరణించిన తలారి సత్తయ్య దశదినకర్మకు గ్రామప్రజల ఆశీర్వాదంతో ఈరోజు చేగుంట మండలం చందాయిపేట గ్రామంలో 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయం అందజేసినస్థానిక సర్పంచ్ బుడ్డస్వర్ణలత-మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డభాగ్యరాజ్. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ తెరపైకి తీన్మార్ మల్లన్న

**బీసీకి టికెట్ ఇచ్చే యోచనలో కాంగ్రెస్**

**బీసీ గండం దాటితేనే 'వెలిచాల'కు అవకాశం**

**31న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం**



కరీంనగర్: కాంగ్రెస్‌లో కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థి ఎవరన్న చిక్కుముడి వీడడం లేదు. ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ తొమ్మిది సార్లు సమావేశమై అభ్యర్థులను ఖరారు చేసినా కరీంనగర్ అభ్యర్థి విషయం తేలడం లేదు. ఈ కమిటీ సమావేశం ఈనెల 31న ఢిల్లీలో జరుగనుండగా పదోసారైనా అభ్యర్థి ప్రకటన వెలువడుతుందా అన్నది ప్రశ్నార్థకంగానే ఉన్నది. రాష్ట్రం నుంచి ఈ స్థానానికి మాజీ శాసనసభ్యుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరు మాత్రమే పంపించగా ఢిల్లీ స్థాయిలో మూడుపేర్లు ప్రధానంగా పరిశీలనకు వచ్చాయి.

**రెడ్డి.. వెలమ.. బీసీ..**

రెడ్డి సామాజికవర్గానికి చెందిన ప్రవీణ్‌రెడ్డి, వెలమ సామాజికవర్గానికి చెందిన వెలిచాల రాజేందర్‌రావు, బీసీ సామాజికవర్గం నుంచి రుద్ర సంతోష్‌కుమార్ పేర్లు పరిశీలనకు వచ్చాయి. తొలుత రెడ్డి సామాజికవర్గంవైపే మొగ్గు చూపిన కేంద్ర నాయకత్వం రాష్ట్రంలో రెడ్డి అభ్యర్థులు ఎక్కువ అవుతున్నారన్న కారణంగా వెలిచాల రాజేందర్‌రావు పేరును పరిశీలించడం ప్రారంభించింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మరో ముగ్గురు శాసనసభ్యులు, ముగ్గురు నియోజకవర్గ ఇన్‌చార్జిలు కూడా రాజేందర్‌రావుకు మద్దతు ప్రకటించడంతో ఆయన పేరే తొమ్మిదవ జాబితాలో ప్రకటిస్తారని అందరూ ఆశించారు. ఈ వ్యవహారం కులాల సమీకరణాల మధ్య మరింత చిక్కుపడి పోయి అధిష్ఠానం నిర్ణయం తీసుకోకుండా తర్వాత సమావేశానికి వాయిదా వేసింది. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలు ఉండగా మూడు స్థానాలను ఎస్సీలకు, రెండు స్థానాలను ఎస్టీలకు రిజర్వుచేశారు. 12 జనరల్ స్థానాల్లో బీసీలు, అగ్రవర్ణాలకు చెందిన ఇతర కులాలకు ఈ స్థానాలను కేటాయించాల్సి ఉన్నది. ఇప్పటి వరకు 13 స్థానాలకు కాంగ్రెస్ అధిష్టానవర్గం అభ్యర్థులను ప్రకటించింది. అభ్యర్థులను ఖరారు చేయని స్థానాల్లో కరీంనగర్, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ మిగిలిపోయాయి. వరంగల్ ఎస్సీలకు రిజర్వు చేసిన స్థానం కాగా, మిగతా మూడు జనరల్ స్థానాలుగా ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రకటించిన 13 మంది అభ్యర్థుల్లో ఇద్దరు ఎస్సీ, ఇద్దరు ఎస్టీ, ముగ్గురు బీసీ, ఆరుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నారు. కరీంనగర్‌ను మొదటి నుంచి రెడ్డికి కానీ వెలమకు కానీ ఇవ్వాలనే అభిప్రాయంతోనే సర్వేలు నిర్వహిస్తూ వచ్చి ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్‌రావు పేర్లను పరిశీలించి తర్జనభర్జన పడుతూ ఖరారు చేయకుండా ఉన్నారు. ఇప్పుడు ఈ రెండు సామాజికవర్గాలకు కాకుండా బీసీలకు ఈ స్థానం కేటాయించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ బీసీలకు ఆరు స్థానాలను, బీజేపీ ఐదు స్థానాలను కేటాయించాయి. ఇప్పటి వరకు కాంగ్రెస్ మూడు స్థానాల్లో మాత్రమే బీసీలకు అవకాశం కల్పించింది. మిగిలిన మూడు స్థానాల్లో రెడ్డి, వెలమ, ఇతర కులాలకు చెందిన వారిని ప్రకటిస్తే బీసీ వ్యతిరేక పార్టీ అని అనుకునే ప్రమాదముందని, ఇతర పార్టీలు కూడా ఇదే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్తాయని కాంగ్రెస్ ఆలోచిస్తున్నట్లు తెలిసింది. బీసీల ఓట్లు కీలకంగా ఉన్నందున మిగిలిన మూడు స్థానాల్లో ఒకటి లేక రెండు స్థానాలను వారికే ఇవ్వాలనే ఆలోచన కూడా చేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన రోజుల్లోనే బీసీలకు ఐదు సీట్లు కేటాయించాలనే డిమాండ్ వచ్చింది. పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలకు కూడా బహిరంగంగానే ఈ ప్రకటనకు మద్దతు పలికారు. ఇప్పుడు మూడు సీట్లతో సరిపెడితే బీసీలు దూరమయ్యే అవకాశముందని కాంగ్రెస్ నాయకత్వం ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తున్నది. ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సతీమణి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు, కమ్మ సామాజికవర్గానికి చెందిన మరోమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కుమారుడు టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఒకరికి టికెట్ ఇవ్వాల్సి ఉన్ననేపథ్యంలో బీసీల కోటాలో వారు రారు. మిగిలిన రెండు స్థానాలు కరీంనగర్, హైదరాబాద్‌లో బీసీలకు అవకాశం కల్పించడమే మిగిలిందని తెలుస్తున్నది.

**స్థానికులకు అవకాశం ఇవ్వాలంటున్న సంతోష్‌కుమార్**

కరీంనగర్ నుంచి టికెట్ ఆశిస్తున్న రుద్ర సంతోష్‌కుమార్ పేరు పరిశీలనలో ఉన్నా ఈ స్థానంలో భువనగిరి టికెట్ ఆశించిన తీన్మార్ మల్లన్న అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తే ఎలా ఉంటుందని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఈ ప్రతిపాదనను కేంద్ర కమిటీ ముందు ఉంచారని, ఈ కారణంగానే రాజేందర్‌రావు పేరు ప్రకటన దశలో నిలిచిపోయిందని సమాచారం. రుద్ర సంతోష్‌కుమార్ స్థానికుడినైన తనకు కాకుండా స్థానికేతరులకు టికెట్ ఇవ్వడం సమంజసం కాదని, అలా చేస్తే పార్టీ ఎన్నికల్లో దెబ్బతినే అవకాశమున్నదని నాయకులతో అన్నట్లు తెలిసింది. ఇప్పటికే బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను స్థానికేతరుడిగా అభివర్ణిస్తూ ప్రచారం చేస్తున్నారు. పక్క జిల్లాకు చెందిన వినోద్‌కుమార్ ఒకసారి కరీంనగర్ ఎంపీగా గెలిచిన నేపథ్యం ఉన్నా ఆయనను స్థానికేతరుడు అంటున్న దశలో కాంగ్రెస్ స్థానికేతర అభ్యర్థిని తీసుకొని వస్తే బీజేపీ లాభపడడం మినహా కాంగ్రెస్‌కు మిగిలేది ఏమి లేదనే వాధనను సంతోష్‌కుమార్ తెరపైకి తెస్తున్నారని తెలిసింది. కరీంనగర్ స్థానం తీన్మార్ మల్లన్నకు దక్కుతుందా... సంతోష్‌కుమార్ ప్రయత్నాలు ఫలిస్థాయా... బీసీ గండాన్ని దాటుకొని రాజేందర్‌రావు టికెట్ దక్కించుకుంటారా అనేది తేలాల్సి ఉంది.



## కొండ మురళి ఇంట్లోలో ఘనంగా బోల్లం నితిన్ పటేల్ 23వ జన్మదిన వేడుకలు

పరకాల , వరంగల్ జిల్లా (వాయిస్ టుడే) నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా వరంగల్ జిల్లా జనరల్ సెక్రెటరీ బోల్లం నితిన్ పటేల్ 23వ జన్మదిన వేడుకలను గురువారం కొండ మురళి ఇంట్లోలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మరియు ఈ కార్యక్రమం లో భరత్ , భాను అన్వేష్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు .

## రామన్నపేట ఎంపీపీ పదవికి జ్యోతి రాజీనామా



రామన్నపేట, మార్చి 28: రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి తన పదవికి రాజీనామా చేశారు. జడ్పీ సీఈవో శోభారాణిని గురువారం కలిసిన ఆమె తన రాజీనామా లేఖను అందించారు. కక్కిరేణి ఎంపీటీసీగా గెలుపొందిన ఆమె ఎంపీపీగా పనిచేశారు. ఇటీవల కాంగ్రెస్, ఇతర ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటించడంతో ఈ నెల 30వ తేదీన అవిశ్వాస తీర్మానం ఉంది. అవిశ్వాసానికి ముందే ఎంపీపీ తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత సీఈవో శోభారాణి మాట్లాడుతూ ఎంపీపీ రాజీనామా లేఖ కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తామన్నారు. ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ తనకు నాలుగున్నర సంవత్సరాలు పా టు సహకరించిన ఎంపీటీసీ సభ్యులు, నాయకులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ ఎంపీ టికెట్‌పై దుమారం

**ఢిల్లీలో ధర్నా చేస్తున్న మాదిగ శక్తి నాయకులు**

**మాదిగలకు ఇవ్వాలని నేతల డిమాండ్**

**మాదిగ శక్తి ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా**




పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చాలంటూ మొదలైన దుమారం సద్దుమణగడం లేదు. పార్టీకి చెందిన మాదిగ సామాజికవర్గ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, సంఘాల నేతలు ఆందోళనలు చేస్తున్నారు. పెద్దపల్లి అభ్యర్థిగా మాజీ ఎంపీ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ పేరును ప్రకటించింది. దీంతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలు భగ్గుమంటున్నారు. నియోజకవర్గం ఏర్పాటైన నాటినుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి ఆగం చంద్రశేఖర్‌కు మాత్రమే ఒకసారి టికెట్ ఇవ్వగా, మిగతా ఎన్నికల్లో మాల సామాజిక వర్గానికి చెందిన వాళ్లకే ఇస్తున్నారని, వాళ్లంతా స్థానికేతరులేనని చెబుతున్నారు. గత ఎన్నికల్లో చంద్రశేఖర్ కు టికెట్ ఇవ్వగా గడ్డు పరిస్థితుల్లో కూడా పార్టీ మంచి ఓట్లు సాధించిందని చెబుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులే గెలవడం గమనార్హం. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో తమ గెలుపు సులభమేనని భావించిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది నాయకులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సామాజిక సమీకరణాల దృష్ట్యా ఈసారి ఎలాగైనా పార్టీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్ ఇస్తుందని అంతా ఆశించారు. కానీ మాల సామాజిక వర్గానికి చెందిన వివేక్ తనయుడు వంశీకృష్ణకు టికెట్ ప్రకటించడంతో అంతా ఖంగుతిన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు మాజీ ఎంపీ డాక్టర్ సుగుణకుమారి, జాతీయ యువజన నాయకుడు ఊట్ల వరప్రసాద్, పార్టీ నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్, గజ్జెల కాంతం, పెర్క శ్యామ్ తదితరులు టికెట్ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేశారు. సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్రంలో ఉన్న మూడు ఎస్సీ పార్లమెంటు నియోజకవర్గాల్లో కనీసం రెండు నియోజకవర్గాల్లోనైనా మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలకు పార్టీ టికెట్ ఇస్తుందని భావించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉండడంతో ఎలాగైనా పెద్దపల్లి టికెట్‌ను మాదిగలకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. మరోవైపు మాదిగ ఐక్యవేదిక, మాదిగశక్తి ఆధ్వర్యంలో ఆ పార్టీకి వినతిపత్రాలు అందజేశారు. మాదిగలకే టికెట్ ఇవ్వాలంటూ జిల్లా కేంద్రంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్దఎత్తున డప్పుల చాటింపు కార్యక్రమం కూడా నిర్వహించారు. మాదిగ శక్తి ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ నేతలకు వినతిపత్రాలు కూడా అందజేశారు. కానీ పార్టీ గడ్డం వంశీకృష్ణ వైపై మొగ్గుచూపింది.

**నేతల్లో అసంతృప్తి..**

వివేక్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేస్తున్న వంశీకృష్ణ మొట్టమొదటిసారిగా ఎంపీగా పోటీ చేయబోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో ఉన్న వివేక్ అనూహ్యంగా యూటర్న్ తీసుకొని తన కుమారుడితో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో వివేక్ చెన్నూరు నుంచి, ఆయన సోదరుడు వినోద్ బెల్లంపల్లి నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఎంపీ అభ్యర్థిగా వంశీకృష్ణకు టికెట్ ఇవ్వడంతో మిగతా నేతలు గుర్రుమంటున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురికి టికెట్ ఇవ్వడంపై తీవ్రమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి నుంచి గడ్డం వెంకటస్వామికి ఆరుసార్లు, ఆయన కుమారుడు వివేక్‌కు రెండుసార్లు టికెట్ ఇచ్చిన పార్టీ మళ్లీ అదే కుటుంబానికి చెందిన వివేక్ వారసుడు వంశీకృష్ణకు టికెట్ ఎలా ఇస్తారంటూ పలువురు పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. పెద్దపల్లి టికెట్ ఆశించిన యువజన జాతీయ నాయకుడు ఊట్ల వరప్రసాద్ ఇటీవల ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి పార్టీలోనే ఉంటూ పార్టీ జెండాలు మోస్తున్న వారిని కాదని, పలుసార్లు పార్టీలు మారి వచ్చిన ప్యారాచూట్ నేతలకు పార్టీ టికెట్ ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ నియోజకవర్గంలో గెలుపొందే సత్తా ఉన్న నాయకులే లేరా అని ఆయన ప్రశ్నించారు. మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి రాజకీయ వారసులం తామేనని, వివేక్ తనయుడు కాదని ఆయన ఆక్రోషం వెళ్లగక్కారు. పార్టీ అభ్యర్థిని మార్చే విషయమై అధిష్ఠానం పునరాలోచన చేయాలని, లేదంటే వచ్చేనెల 5వ తేదీన పెద్దపల్లి నియోజకవర్గ కేంద్రంలో నిరసన దీక్ష చేపడతానని వరప్రసాద్ హెచ్చరించారు. మరోవైపు మాదిగ శక్తి ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్దపల్లి అభ్యర్థిని మార్చాలని, మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతలకు టికెట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.